# తీరిన కోరిక

ఐ హేట్ హర్... ఐ హేట్ హర్ విత్ ఆల్ మై హార్ట్ అండ్ సోల్! బొగ్గులు తేవాలట... బొగ్గులు... తన జీవితంలోకి బొగ్గులే తెచ్చింది... మల్లెలు తెస్తుందను కున్నాడు. గులాబీలు తెస్తుందనుకున్నాడు. మల్లెల మాధుర్యంతో ప్రపంచాన్ని మరపిస్తుందను కున్నాడు. కాని బొగ్గులు... బొగ్గులు తెచ్చింది. "వచ్చేటప్పుడు బొగ్గులు తీసుకరాకపోతే రాత్రికి వంట సున్న". ఎంత నిర్లక్ష్యం... ఎంత పొగరు... ఎంత అహంకారం... ఎంత బాధ్యతారాహిత్యం... ఎంత తేలికతనం... తన సంపాదన మీద, తన బతుకుమీద – మార్కెట్‌లో తన విలువమీద... ఛీ... ఛీ... ఛీ... ఈ ఆడవాళ్ళంతా యింతే. తమ ఆర్థికావసరాలు తీర్చే ఒక సాధనంగా వాడుకుంటారు మగవాణ్ని. మగవాడు ఆ సాధనం కావటంలో ఫెయిల్ అయితే వాడిని ఎంత అపహాస్యంపాలు చెయ్యటానికి కూడా వెనుకాడరు. ఇది లాస్ట్ వీక్ కదా... తన దగ్గర నయాపైసా లేదని తెలుసు కదా... ఎందుకలా బొగ్గులు తెమ్మని పురమాయిస్తుంది? తను ఎలా తేగలడు? ఏ పక్క వారింట్లోనో అరువుతెచ్చి ఎలాగో ఈ రెండు రోజులు గడపకూడదు? అబ్బే... పక్కవారిని అడగదట... ఇంటింటికి బిచ్చమెత్తదట... కాని తనుమాత్రం ఎవడి దగ్గరకో వెళ్ళి కాళ్ళావేళ్ళా పడి డబ్బు సంపాదించి, బొగ్గులుకొనుక్కొని వస్తే వంటచేస్తుంది... తన పెళ్ళి అయినప్పట్నించి చూస్తున్నాడు... సావిత్రిలో ఆ గర్వం.... ఆ పొగరు... ఆ నిర్లక్ష్యం... తనంటే ఆ తేలిక భావం... తమ పుట్టింటివాళ్ళు బాగా డబ్బున్నవాళ్ళనే ఆ సుపీరియార్టీ కాంప్లెక్సు... తన అన్నగాడెవడో తహసీల్దార్ అనే బింకం. అంత గొప్పవాళ్ళయితే తనకెందుకిచ్చారు? ఏ మహారాజు కుమారుడికో యిచ్చి చెయ్యకపోయారా? ఒంటి స్తంభం మేడమీద కూర్చోబెట్టి ప్రతిరోజూ పూజ చేసేవాడు... అసలు తనన్నా, తను చేస్తున్న ఉద్యోగమన్నా సావిత్రికి యేమాత్రం గౌరవం లేదు. ఆ కారణంగానే తనంటే అంత నిర్లక్ష్యం.... తేలికభావం... ఆ నిర్లక్ష్యాన్ని, ఆ తేలికభావాన్ని ఎలా అణచెయ్యాల్లో తనకి అంతుపట్టటం లేదు...

రాజారావు ఇంటినుండి కాలేజీ వైపు నడుస్తున్నాడు. అతనిచేతిలో ఉన్న చిన్న నోట్‌బుక్ నలిగిపోతున్నది. దార్లో ఇద్దరు ముగ్గురు స్టూడెంట్స్ "గుడ్‌మార్నింగ్ సర్" అంటున్నా రాజారావు గమనించటం లేదు.

సావిత్రిని మొదటిసారి చూసినప్పుడు ఎన్ని మధుర స్వప్నాలలో తేలిపోయాడు. తనను మరల్చి, మత్తెక్కించి మధురలోకాలలో విహరింపజేస్తుందను

కున్నాడు. సావిత్రి నిజంగా అందమైంది. (ఆమె గర్వానికి కారణం కొంతవరకు ఆ అందమని కూడా తనకి చాలాసార్లనిపించింది.) ఏ ఊర్వశో, మేనకో దివి నుండి భువికి తనకోసం దిగి వచ్చిందనుకున్నాడు. ఆమెతో గడపబోయే జీవితాన్ని గూర్చి ఎంత కవిత్వం రాసుకున్నాడో తనలో తను. ఎన్ని యుగాలుగానో తను సావిత్రి కోసం ఎదురుచూస్తున్నాననుకున్నాడు. ఆమెలో ఐక్యమైపోయి తరతరాలుగా అనుభవిస్తున్న నిరంతర తపనని విరహాన్ని తీర్చుకోవాలనుకున్నాడు. చలంగారి ఊర్వశీ పురూరవుల్లా... సావిత్రీ తనూ గొప్ప ప్రేమమయ శృంగారమయ జీవితాన్ని గడపాలనుకున్నాడు... సావిత్రితో పెళ్ళయ్యింది... కలల్లో నుండి వాస్తవంలోకి వచ్చాడు. అందం తను అనుకున్నంత పవిత్రమైనది, అలౌకికమైనది కాదనిపించింది. సావిత్రిలో ఐక్యమై తన జీవితాన్ని తరింపజేసుకోవాలన్న తన కోరిక తీరలేదు. ఆమెతో ఐక్యమైపోయి తన జీవితాన్ని తరింపజేసుకోవాలన్న తన కోరిక తీరలేదు. అసలు సావిత్రికి తనకి మధ్య యెన్నో తెరలు.... ఎన్నో అఖాతాలు... సావిత్రిలో ఎప్పుడూ ఆ అంటీ అంటనితనం... యేదో మాయ... తనకర్థంకాని యెన్నో లోకాలు... ఆ లోకంలోకి తనని రానివ్వదు. తను వెళ్ళలేడు... ఆ మాయని మాయం చెయ్యలేడు. సావిత్రి అందం తనకో ఎండమావి అయ్యింది. వెర్రిగా ఆ ఎండమావిని అనుభవించా లనుకుంటాడు. వెర్రిగా ఆ ఎండమావికోసం పరిగెత్తుతాడు. కాని ఆ అందానికి, తనకి మధ్య అశేషమైన అఖాతాలున్నాయి. ఆ అందం తనదికాదు. తనది చేసుకోలేడు... అదో అడవికాచిన వెన్నెల...

తనంటే సావిత్రికి ఆ నిర్లక్ష్యం యెందుకో తనకర్థంకాదు. తనకేం తక్కువ? అందంగా లేడా? తను ఎం.ఏ. చదివే రోజుల్లో తమకి పొలిటికల్ థాట్ చెప్పే మేడమ్ (చాలా అందంగా ఉండేది... కొంచెం వయస్సెక్కువైనా...) తననెప్పుడూ "ఎ వెరీ స్మార్ట్‌బోయ్" అనటం మరిచిపోలేడు. తన క్లాస్‌మేట్ ఉమ తనకేసి ఆశగా చూడటం ఎప్పుడూ జ్ఞాపకం వస్తుంది... కాని సావిత్రి... ఒక్కసారైనా... తన జుట్టులోకి చేతులుపోనిచ్చి, (తన భార్య తన జుట్టులోకి చేతులుపోనిచ్చి మాట్లాడాలని తనకో గాఢమైన కోరిక) తన కళ్ళల్లోకి పరవశంతో చూస్తూ, తన హృదయం మీద వాలిపోయి "మీరు ఈ సూట్‌లో చాలా బావుంటారండి... ఈ కలర్ మీకు అద్భుతంగా ఉంటుందండీ" అంటుందా? పోనీయ్... తను "నువ్వు ఈ చీరెలో అద్భుతంగా వుంటావు... ఈ చీరె కట్టుకో" మంటే "అబ్బే! ఆ చీరెలో అమ్మమ్మలాగుంటాను... యేం సెలక్షనండి" అంటుంది. ఒకసారెప్పుడో బట్టలషాప్‌కెడితే ఎవరో ఒక అందమైన

యువతి ఒక చీరె బేరమాడుతోంటె చూసాడు. ఎందుకో, తనకా చీరె వెంటనే నచ్చింది. (ఆ యువతి అందంగా ఉండటం వల్ల ఆ చీర అందంగా కన్పించిందేమోనని ఆ తర్వాత అనుకున్నాడు) సావిత్రి ఆ చీరెలో యే వైజయంతిమాల లాగానో ఉంటుందని పించింది. వెంటనే ఆ చీర ఆ అమ్మాయి అడిగిందానికంటే ఐదు రూపాయలు ఎక్కువిచ్చి... సావిత్రిని... తన ముద్దుల భార్యని... తన అర్ధాంగిని సంతోష సాగరంలో ముంచెత్తాలని, ఆనంద పారవశ్యాలలో తేలించాలని... కొండంత ఆశతో యింటికొచ్చాడు. "ఏడ్చినట్లుంది... మీరిలాగే చెత్త చీరలకి డబ్బు తగలేస్తా"రంది... తన ముఖం మీదే... ఆ రాత్రంతా ఎంత నరకయాతనని అనుభవించాడో?

రాజారావు జేబులో నుండి కర్చీఫ్ తీసి నొసలు మీది చెమట తుడుచు కున్నాడు.

తను ప్రతిరోజూ కాలేజీకి వెళ్తాంటాడు కదా... వెళ్ళేటప్పుడు ఒక్కసారైనా ప్రేమగా, గోముగా "మళ్ళీ ఎప్పుడొస్తారు... ఇంతసేపు – ఇన్ని యుగాలు... మిమ్మల్ని విడిచి ఎలా ఉండను... వచ్చేటప్పుడు నాకేం తెస్తారు...?" అంటూ ఒక తీయని ముద్దిస్తుందా? అలా అనిపించుకోవాలని తనలో ఎన్నాళ్ళుగానో ఒక గాఢమైన కోరిక... బీరువా తాళపుచెవి మరచిపోతున్నారు... టెక్ట్సుబుక్ మరచిపోతున్నారు... ఎంత మతిమరుపు బాబు... ఆ పిల్లలకేం చెప్తున్నారో... ఈ ఫ్లాస్క్‌లో హార్లిక్సు పోశాను... మధ్యాహ్నం తీసికోవటం మరచిపోకండి... ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవడం తెలియనే తెలియదు... "పసిపిల్లాడి కంటే అన్యాయం" (పసిపిల్లోడికంటె అన్యాయం అని అన్పించుకోవటం తనకి చాలా యిష్టం... మొన్నటి వరకు అమ్మ అంటుండేది మావాడు పసిపిల్లాడి కంటె అన్యాయమని) అంటుందా? కనీసం పుట్టింటికెళ్ళేప్పుడైనా "ఆరోగ్యం జాగ్రత్త"నో "హోటల్ తిండి మీకసలే పడద"నో "నేనొచ్చేవరకు ఎంత చిక్కిపోతార"నో "మిమ్మల్ని విడిచి ఒక్క క్షణమైనా బతకగలనా? వెంటనే తిరిగిరానూ!" అనో అంటుందా? ఈ కోరిక కూడా తనకి తీరని కోరికేనా? ఈ విషయాలన్నీ ఎవరితోనైనా చెప్పుకునేవా? పుట్టింటికెళ్ళాక ఉత్తరం రాస్తుందేమోనని ఎదురు చూస్తాడు. ఉత్తరాలు రాసుకోవటం తనకి యెంతో యిష్టం. ఒక ప్రేయసిని ఊహించుకొని ఇలా ఇలా లవ్ లెటర్స్ రాసికోవాలని చదువుకునే రోజుల్లో ఎన్ని మధుర స్వప్నాలని కనేవాడో... సావిత్రి అసలు ఉత్తరాలు రాయదు... మొదట్లో తను ఎంతో రొమాంటిక్‌గా, పేజీలకొద్దీ ఉత్తరాలు రాసేవాడు. తన ఉత్తరాలు చదివి ఆమె ఎంత పరవశించిపోతుందో... అనుకునేవాడు... కానీ ఆమె "ఏమోనండీ, ఆ

కవిత్వం నాకేం అర్థం కాలేదు..." అంది... ఒకసారి చెత్తకాగితాలతో పాటు తను రాసిన ఉత్తరాల్ని బయటపారేస్తోంటే చూశాడు... గుండెలు మండిపోయాయి. అప్పుడు అనిపించింది.... తనో అందమైన పశువుని చేసికున్నానని... సావిత్రి మీద చెప్పలేనంత ఆగ్రహం, అసహ్యం కల్గాయి... కాని యేమీ అనలేకపోయాడు.... మండే గుండెల్ని తనే చల్లార్చుకున్నాడు... యేమైనా అంటే అదో పెద్ద సీన్‌కి దారితీస్తుంది... సావిత్రి రెచ్చకొట్టే మాటలు బాగా అనగలదు... మాట మాట పెరగటం... గట్టిగా అరచుకోవటం తనకసహ్యం... ఉత్త అనాగరికంగా, అసభ్యంగా, కొండజాతి ప్రజల కీచులాటలా ఉంటుంది... తను ఎప్పుడైనా యే కొంచెం గట్టిగా మాట్లాడినా వెంటనే సావిత్రి ఇదే ఆయుధం ప్రయోగిస్తుంది. "మనకీ, అలగాజనానికి భేదమేముంది...?" అంటుంది. (తనో అలగాజనం వాడిని పెళ్ళి చేసుకున్నాననే అర్థం ధ్వనిస్తుంది తనకా మాటలో)

తను యెన్నిసార్లో సరిపెట్టుకోవటానికి ప్రయత్నించాడు. తనకి కొన్ని పిచ్చి సెంటిమెంట్స్ ఉన్నాయని, పిచ్చి కోరికలున్నాయని అవన్నీ ఉత్త బాల్య చేష్టలని, వాటన్నిటిని నిర్దాక్షిణ్యంగా అణచేసుకున్నాడు. అన్నింటికంటె ముఖ్యం... తనకి స్త్రీలంటే ఎంతో గౌరవం. ఒక పదేళ్ళు శరత్ సాహిత్యం, చలం సాహిత్యం "తాగి బ్రతికాడు" ఈ దేశంలో స్త్రీకి చాలా అన్యాయం జరిగిందని తరతరాలుగా స్త్రీని పురుషుడు హీనాతి హీనంగా తన పాదాలక్రింద అణచి పెడుతున్నాడని, పాతివ్రత్యం అనే పేరుతో, స్త్రీని యెలాంటి వ్యక్తిత్వం లేని ఒక బానిసగా పురుషులే తయారుచేసారని, ఈ కారణంగా స్త్రీ మానసికంగా యెదగలేకపోతున్నదని, కాబట్టి స్త్రీకి సంపూర్ణ స్వాతంత్ర్యం అవసరమని, పురుషుడు, సమాజం, కట్టుబాట్లు మొదలైన కబంధ హస్తాల్లోంచి - స్త్రీ బయటపడాలని - తను గాఢంగా నమ్మేవాడు. స్నేహితుల్తో వాదించేవాడు, గొంతు చించుకునేవాడు. ఆరోజుల్లో తన ఊర్లో ఎప్పుడూ భార్యను ఘోరంగా, క్రూరంగా హింసించే రామయ్య జ్ఞాపకం వచ్చేవాడు. ప్రతిరోజు ఆ రామయ్య తన భార్యని గొడ్డుని బాదినట్లు బాదేవాడు. చితకకొట్టేవాడు. చుట్టుప్రక్కల వాళ్ళంతా ఆ దృశ్యాన్ని వినోదాన్ని చూసినట్లుగా చూసేవాళ్ళు. అందరితోపాటు తనూ అలా చూస్తూ నిల్చొనేవాడు. అంత మందిలో ఒక్కడైనా రామయ్యకి అడ్డొచ్చేవాడు కాదు. ఎవరైనా ధైర్యంచేసి రామయ్యని ఆపబోతే "నా పెళ్ళాన్ని నేను తంతాను... చంపుతాను... నువ్వెవడివిరా?" అంటూ నానా బూతుమాటలు తిట్టేవాడు... పాపం రామయ్య భార్య కుయ్యో మొర్రో అంటూ ప్రతీరోజు రామయ్య దెబ్బల్ని భరించేది. ఐనా అంతా ఆమెదే మంచిబుద్ధి కాదనేవాళ్ళు...తనకది క్రూరంగా, రాక్షసంగా,

అమానుషంగా కన్పించేది... తనలోని నరనరాలు బాధతో మూల్గేవి. ఆ రామయ్యనొక పశువుగా, మనుష్యుల్ని భక్షించే నరరూప రాక్షసుడిలా ఊహించుకునేవాడు.

ఒకసారి గమ్మత్తైన సంఘటన జరిగింది. సావిత్రి, తనూ రిక్షాలో సినిమాకెడ్తున్నారు. దార్లో కూరగాయల మార్కెట్ కన్పించింది. సావిత్రిని ఉడికించాలని "అదిగో... అక్కడ కూరగాయాలమ్ముతున్న అమ్మాయుంది చూడు... చాలా అందంగా ఉంది కదూ" అన్నాడు.

"ఎక్కడ... నాకు కన్పించటం లేదు" అంది సావిత్రి.

"అదిగో... ఆ మూడోషాపు... నేనెప్పుడు కూరగాయలు తెచ్చినా అక్కడే తెస్తాను. ఆ అమ్మాయి అంటే నాకిష్టం" అన్నాడు.

"ఔను... మగవాళ్ళేం చేసినా చెల్లుతుంది.... అదే ఆడది చేస్తే..." అంది సావిత్రి నిష్ఠూరంగా... వెంటనే తనకి స్త్రీ స్వాతంత్ర్యాన్ని గూర్చిన తన అభిప్రాయాలు గుర్తొచ్చాయి... స్త్రీల కోసం గుండెలు బాదుకునే తనని తన భార్య అలా అనటం చాలా ఘోరంగా తోచింది... వెంటనే అన్నాడు-

"అదేంలేదు సావిత్రీ... నాకిష్టమైన ఆడవాళ్ళున్నట్లే, నీకిష్టమైన మగవాళ్లుండొచ్చు - నాకేం అభ్యంతరం లేదు... మనవాళ్లు చెప్పే పాతివ్రత్యం అంటే నాకు భలే అసహ్యం..."

"ఊరికే మాటలంటారు... నిజంగా మా యిష్టాల్ని చెప్తే మీరు భరిస్తారా?" అంది సావిత్రి.

ఎన్నాళ్లుగానో తన హృదయమంతటితో నమ్మిన తన అభిప్రాయాలకి, సావిత్రి ప్రశ్న ఒక ఛాలెంజిలా తోచింది.

"నామాట మీద నమ్మకం లేదా? ఇప్పుడే చెప్పు... నీకిష్టమైన మగవాళ్ళెవరైనా వుంటే... నేనేమీ అనుకోను... ప్లీజ్ సావిత్రి... చెప్పు" అన్నాడు ఆవేశంగా.

"అదిగో... అలా వెళ్తున్నాడే ఆ మంచి కండులున్న ఆ రిక్షావాడంటే నాకు చాలాయిష్టం" అంది సావిత్రి చిలిపిగా నవ్వుతూ... తనకా రిక్షావాడు కన్పించలేదు. కేవలం తనని ఉడికించడానికి సావిత్రి అలా రిక్షావాడిని చూపించిందని తనని తాను సమాధాన పరచుకోబోయాడు. తేలికగా నవ్వడానికి ప్రయత్నించాడు. కాని తనకు తెలియకుండానే తనలో సావిత్రిపట్ల ఏదో అనుమానం లాంటిది స్థావరమేర్పరుచుకోబోయింది... కాని వెంటనే దాన్ని కొట్టివేశాడు... త్రుంచివేశాడు... మరచిపోవటానికి ప్రయత్నించాడు... ఐనా, ఎందుకో మరచిపోలేకపోయాడు... ఆ రిక్షావాడెలా గుంటాడోనని కండలున్న వాడి రూపాన్ని రకరకాలుగా ఊహించుకున్నాడు.

ఏమైనా సావిత్రికి తను దగ్గర కాలేకపోయాడు. ఇద్దరిమధ్య యేర్పడిన ఆ ఇనుపతెరలు అలాగే వున్నాయి. సావిత్రితో ఒక సంవత్సరం కాపురం చేసినా, సావిత్రి తనకి యింకా ఒక మాయగా, ఒక చిక్కుప్రశ్నలాగానే ఉండిపోయింది. సావిత్రి అందం తనకి యింకా ఎండమావే. ఎన్నో రాత్రులు సావిత్రి తనను ఊరించి, ఊగించి తన రక్తాన్ని వేడెక్కించి, ఉడికించి, వేధించి, తనని తృప్తిపరచకుండానే తను మాత్రం నిద్రపోయింది... రాత్రి... యస్. రాత్రి జరిగిన సంఘటన తనకి నిజంగా పిచ్చెక్కించింది.

నిన్నంతా ఎంతో ఉత్సాహంగా గడిచింది. నిన్న ప్రిన్సిపాల్ తన తోటి లెక్చరర్స్ ముందు స్టాఫ్ మీటింగ్‌లో "రాజారావు... ఎ నైస్ బోయ్... ఇంత చిన్నవయస్సులోనే అద్భుతంగా టీచ్ చేస్తున్నా"డని మెచ్చుకున్నాడు. బి.ఏ. ఫైనలియర్ క్లాసులోకూడా నిన్నంతా ఎన్నడూ లేనంత గొప్ప ఉత్సాహంతో గడిచింది... బాగా జోక్స్ వేశాడు. విద్యార్థుల్ని యే వందసార్లో గొల్లుమని నవ్వించాడు. ఎన్నడూ నిండుగా నవ్వని ఆ కాలేజిలోకల్లా అందగత్తె సుజాత నిన్న పగలబడి, విరగబడి నవ్వింది. (ఆ సుజాతంటే తనకిష్టం... నిన్న ఎందుకో మరీ అందంగా కన్పించింది) ఎందుకో, మనస్సు ఏయే లోకాల్లోకో తేలిపోయింది... అదే ఉత్సాహంతో యింటికొచ్చాడు. సావిత్రి తనకిష్టమైన పాలవెన్నెల నురుగుల్ని విరజిమ్ముతున్న తెల్లచీర కట్టుకొంది... తలలో కొల్లలు కొల్లలుగా మల్లెలు పెట్టుకుంది. (తనకి తెల్లచీరన్నా, మల్లెపూలన్నా చచ్చే యిష్టం) ఎన్నడూ లేనంత జగదేక మోహనంగా కన్పించింది సావిత్రి... ఆమెకి యేవేవో విషయాలు చెప్పాడు... కాలేజీలో ప్రిన్సిపాల్ తనని మెచ్చుకున్న విషయం... తను క్లాసులో ఎలా ఎన్నడూ నవ్వని సుజాతని నవ్వించిన విషయం... మళ్ళా ఎన్నో జోక్స్ చెప్పాడు. సావిత్రిని కూడా బాగా నవ్వించాడు. సావిత్రిలో ఎప్పుడూ వుండే ఆ "అంటీ అంటని"తనాన్ని చాలావరకు పోగొట్టాననుకున్నాడు. అలా మాట్లాడుతుండగానే రాత్రి అయ్యింది... తన ఉత్సాహంలాగే బయటంతా వెన్నెల పరచుకొంది... వెన్నెలంటే తనకి ప్రాణం... సావిత్రి ఆ తెల్లచీరలో, ఆ మల్లెపూలలో, వెన్నెలతో పోటీ చేస్తున్నట్లని పించింది. ఆ వెన్నెల్లో నాట్యం చెయ్యాలనిపించింది. మంచు పర్వతాల మీద దొర్లాలనిపించింది. ఆ వెన్నెల్లో సావిత్రితో, యేవో మధురమైన కబుర్లు చెప్పుకుంటూ... ఊర్వశీ పురూరవుల్లా విహరించాలనిపించింది... సావిత్రి అందంలో, సావిత్రి గుండెల్లో అంతమవాలనిపించింది... సావిత్రిలో ఉండే ఆ మాయని శోధించాలనిపించింది.

"ఈరోజు... ఇంటివెనుక, వెన్నెల్లో పడుకుందా"మని ప్రతిపాదించాడు.

"అసహ్యంగా వుంటుంది... పక్కింటివాళ్ళు చూస్తారు"

"చూస్తే భయమా? మనిద్దరం శాస్త్రోక్తంగా ఐదారు వందలమంది ముందు పెళ్ళి చేసుకున్నాం..."

"పెళ్ళి చేసుకున్నామని బజార్లో పడుకుందామా?"

"ప్లీజ్ సావిత్రి... ప్లీజ్... ఈరోజు నామాట కాదనకు. ఆ వెన్నెలని చూస్తోంటే, నిజంగా నా మనస్సు పరవశించిపోతున్నది... నీతో అలా నిండు వెన్నెల్లో పడుకుని... నిన్నూ వెన్నెల్నీ తనివితీరా..." తర్వాత చెప్పలేకపోయాడు. (సావిత్రి అంటే తనలో ఒక విధమైన భయం లాంటిది ఉందని తనకి అప్పుడప్పుడనిపిస్తుంది)

"చాల్లెండి. ఎవరన్నా వింటారు"

"ప్లీజ్ సావిత్రి... ప్లీజ్... ఈ ఒక్కరోజు..." బతిమాలాడు. సావిత్రి ఒప్పుకుంది. ఆ క్షణంలో సావిత్రంటే తనలో ఎంత ప్రేమ ఉప్పొంగిందో... ఇన్నాళ్ళూ సావిత్రిని అపార్థం చేసుకున్నాననుకున్నాడు. అలా చేసుకున్నందుకు తనో ఉత్తఫూల్ అనుకున్నాడు. సావిత్రి తన ఆరాధ్యదైవం అనుకున్నాడు.

వెన్నెల్లో మంచం వేసింది సావిత్రి... ఒకరిపక్కన ఒకరు పడుకున్నారు. తామప్పుడు సాక్షాత్తూ ఊర్వశీ పురూరవులే అనుకున్నాడు. చాలాసేపు చుట్టుపక్కల వాళ్ళెవరైనా చూస్తున్నారేమోనని సావిత్రి భయపడింది. "ఎవరైనా చూస్తే కాల్చిపారేస్తా" అన్నాడు తను జేమ్స్‌బాండ్ సీన్‌కానరిలా ఫోజ్ పెడ్తూ...

సావిత్రితో తియ్యగా తన అంతరాంతర జ్యోతిస్సీమల్లో ఎంతకాలంగానో మెదులుతున్న యెన్నో బావాలని చెప్పుకోవాలనిపించింది.

"ఈ వెన్నెలని చూస్తే ఏమనిపిస్తుంది సరూ!" అన్నాడు.

(సావిత్రిని "సరూ!" అని పిలవాలని తన కోరిక... కాని అలా పిలిస్తే "తన కసహ్యం... సావిత్రనే పిలవాలం"టుంది సావిత్రి... అప్పుడు సరూ అని పిల్చినా యేమీ అనకపోవడం తనకి బోలెడు ధైర్యాన్నిచ్చింది)

ఏముంది... రోజూ ఉండే వెన్నెలేగా?" అంది సావిత్రి.

"అంతేనా... పిచ్చి సరూ! ఇంత మధురాతి మధురమైన నిండు వెన్నెల. యే దేవతో మనకోసం కరుణించి పంపించిన ఈ కమనీయ వెన్నెల్ని... రోజూ ఉండేదేగా అని తీసిపారేస్తున్నావు. చలం గారన్నట్లు ప్రకృతి ప్రసాదించిన కొన్ని అతి రమణీయ వస్తువులు రోజూ కన్పింటచం వల్ల ఎంత మామూలైపోయాయో ఈ మానవులకు"

"ఏమిటోబాబు... మీరు ప్రతీదాన్ని యేదో బ్రహ్మాండం చేసి మాట్లాడుతారు... నాకేం అర్థంకాదు"

"బ్రహ్మాండం కాదు సరూ! బ్యూటీ... సౌందర్యం. ప్రపంచంలో కొన్ని అతి సుందరమైన వస్తువులున్నాయి. వాటిని చూస్తే నన్ను నేను మరచిపోతాను... సూర్యోదయాన్ని చూసినా, సూర్యాస్తమయాన్ని చూసినా, నిండు మేఘాల్ని చూసినా, పండు వెన్నెల్ని చూసినా నా హృదయం ఒక అలౌకికానందంతో నిండిపోతుంది. ఏవేవో దివ్య సుందర లోకాలు నాకు కనిపిస్తాయి. అలా ఆ గొప్ప అనుభూతుల్ని అనుభవిస్తున్నప్పుడు నీతో ఉండాలని... నీలో ఐక్యమవ్వాలని... నీ గుండెల్లో గూడుకట్టుకోవాలని... ఒక్కమాటలో... నువ్వూ నేనూ శాశ్వతంగా యేకమైపోవాలని..." పైకి ఆకాశంలోకి నక్షత్ర మండలంలోకి చూస్తూ యేదో చెప్పలేని, మాటలకందని హాయిని చెప్పటానికి ప్రయత్నిస్తున్నాడు... ఎందుకో అకస్మాత్తుగా సావిత్రి తన మాటలు వినటం లేదని అనుమానం వచ్చింది. మనస్సు చివుక్కుమంది... నిండు అమృతకలశంలో విషబిందువులు పడ్డట్లు... "సావిత్రి... సావిత్రి... నిద్రపోతున్నావా?" అన్నాడు గట్టిగా, ఆతురతగా, బాధగా... "ఎందుకలా అరుస్తారు? మీ ఆ ధోరణి ఎప్పటికి పూర్తవుతుందోనని అలా కళ్ళు మూసుకున్నాను" అంది చాలా విసుగ్గా. ఎంత తేలికతనం ఎంత నిర్లక్ష్యం... ఎంత అహంకారం...

"ఇదంతా... యేదో పిచ్చి ధోరణిలా అనిపిస్తున్నదా? ఐయామ్ సో సారీ... నిన్ను విసిగించినందుకు" గుండెలు బరువెక్కుతుంటే, కళ్ళల్లో నీళ్లు ఉబికివస్తుంటే, కంఠం రుద్ధమౌతోంటే అన్నాడు.

"మీకెన్నిసార్లు చెప్పానండి... ఈ కవిత్వం... ఈ సోది... నాకిష్టముండదని... ఐనా ఎప్పుడూ మీరు ఇలాగే మీతో మీరే మాట్లాడుకుంటున్నట్టుగా మాట్లాడుతారు... నాకు నిద్రొస్తున్నది బాబు"

తన హృదయం మీద ఎర్రగా మండుతున్న ఇనుపకడ్డీని అంటించినట్లని పించింది... సావిత్రి మనిషికాదు... పాషాణం. ఒక్కసారి నిలువెల్లా కంపించిపోయాడు. యేదో తనకి తెలియని వైపరీత్యమేదో జరుగబోతున్నదనే భయం, యేదో... ఆమెను యేదో చెయ్యాలన్న మొండి పట్టుదల ఒక్కసారి తనలో జనించాయి. ఒకస్మాత్తుగా, మెరుపులా ఎప్పుడో మరచిపోయిన, తన చిన్నప్పుడు భార్యని గొడ్డులా బాదే రామయ్య తనలో మెదిలాడు... యేం చేస్తుందో, ఈ అందమైన పశువుని అలా బాదితే... ఆ అందమైన పెదవుల్ని ఆపిల్‌పండుని కొరికినట్లుగా కొరికి, రక్తం ప్రవహింపజేస్తే యేం చేస్తుందో? ఆ కొప్పులో పెట్టుకున్న మల్లెల్ని ముక్కలు ముక్కలుగా చిదిమి,

రాలి, నలిగిపోయేలా, ఆ కొప్పు పట్టి ఈడ్చేస్తే యేం చేస్తుందో? ఆ కోమలమైన చెక్కిళ్ళని... నల్లగా అసహ్యంగా కందిపోయేలా వాయిస్తే యేం చేస్తుందో? ఆమె ఒంటికి, ఆమె యవ్వనానికి అతుక్కుపోయిన ఆ జాకెట్‌ని చించేసి... లోపల వేసికున్న బ్రాని తెంచేసి... రాక్షసుడిలా... హిరణ్యకశ్యపుడి రక్తం తాగిన నరసింహుడిలా... ఆమె రక్తాన్ని తాగి వీరవిహారం చేస్తే యేం చేస్తుందో? వెన్నెల నురుగుల్ని విరజిమ్ముతున్న తన కిష్టమైన ఆ తెల్లని చీరని, ముక్కలు ముక్కలుగా కోసేసి... ద్రౌపది చీరలాగిన దుశ్శాసనుడిలా... ఆమెని అవమానపరచి, తనకెప్పుడూ దూరంగా, ఎండమావిలా ఉంచుతున్న ఆ అందాన్ని బట్టబయలు చేసి వికటాట్టహాసం చేస్తే ఏం చేస్తుందో తెలుసుకోవాలనిపించింది. ఆ అందమైన గొంతుని... "నయగరా" సినిమాలో జోసెఫ్ కాటెన్; మార్లిన్ మన్రో గొంతు నులిమి చంపినట్టుగా... నులిమి చంపెయ్యాలని పించింది. ఒక్కమాటలో సావిత్రిని ఆ క్షణంలో తన కబంధహస్తాలలో బందించి ఎర్రచీమను నలిపేసినట్టుగా నలిపెయ్యాలనిపించింది. కాని పిచ్చివాడిలా అలా స్తంభించిపోయాడు. తనలోని యేదో ఒక అతి బలీయమైన శక్తి తనలో అప్పుడు అలా భయంకరంగా ఉవ్వెత్తున ఉప్పొంగిన ఆ విపరీత కోర్కెలకి అడ్డు నిలిచింది.

తనమీద తనకి అసహ్యం కలిగింది. తను ఎన్నిసార్లో ఎంతో గాఢంగా చెయ్యాలనుకున్న పనుల్ని చెయ్యలేకపోయాడు. యేవో వెధవ డెలికసీస్ అడ్డొస్తున్నాయి. నిజంగా తనలా చేస్తే ఏం చేసేదో సావిత్రి. గింజుకునేదా? గట్టిగా శక్తినంతా కూడదీసుకొని అరచేదా? తనంటే ఎప్పుడూ ఉండే ఆ నిర్లక్ష్యం, ఆ తేలికభావం ఏమైపోయేవో? రామయ్య బాదుతుంటే పెద్దగా, అసహ్యంగా, నిస్సహాయంగా అరచే అతని భార్య గుర్తొచ్చింది. సావిత్రి అలా అరుస్తుంటే చూడాలనిపించింది. పక్కింటి వాడెవడైనా అడ్డమొస్తే నా పెళ్ళాన్ని కొట్టుకుంటాను... చంపుకుంటాను... నీ పెళ్ళాం జోలికి రాలేదుగా..." అంటాడు రామయ్యలా... ఎందుకో ఆ క్షణం ఆ రామయ్య చాలా గొప్పవాడనిపించాడు. తప్పకుండా తనకంటే గొప్పవాడే... సందేహం లేదు.

రాజారావు కాలేజీ ఆవరణలో అడుగుపెట్టాడు. శరీరమంతా చెమటలు కారుతున్నాయి. కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు. ఆఫీస్‌లోకెళ్ళి రిజిష్టర్లో సంతకం చేశాడు. వరండాలో "గుడ్‌మార్నింగ్ సర్" అంటున్న విద్యార్థులకి తెచ్చిపెట్టుకున్న నవ్వుతో విష్ చేశాడు. స్టాఫ్‌రూంలోకొచ్చి తన డెస్క్ ముందు కూర్చున్నాడు. అదివరకే ఆ రూంలో ఉన్న ఎకనామిక్స్ లెక్చరర్ రఘుపతి, హిస్టరీ లెక్చరర్ శ్రీధర్‌రావు చదువుకుంటున్నారు. తనకి నెక్స్ట్ పీరియడ్ ఫైనలియర్ క్లాసుంది. ఈరోజు హీగెల్ ఫిలాసఫీని స్టార్ట్ చేస్తానన్నాడు. అందుకు ఎంతో ప్రిపేర్ కావాలి. ఇంటిదగ్గర చదువు

దామనుకున్నాడు. కాని ఇంటిదగ్గర ఒక్కక్షణమైనా పీస్ ఆఫ్ మైండ్ ఉంటేనా? టెక్స్ట్‌బుక్ తెరిచి ఎదురుగా కూర్చున్న రఘుపతికేసి చూసాడు. అతన్ని చూడగానే రెండు మూడు రోజులుగా అతన్ని ఓ పది రూపాయలు అప్పడగాలన్న విషయం గుర్తొచ్చింది. "వచ్చేటప్పుడు బొగ్గులు తీసుకురాకపోతే రాత్రికి వంట సున్న". బొగ్గులు... బొగ్గులు... బొగ్గులంటే తనకి చచ్చే అసహ్యం. ఎప్పుడూ బొగ్గులు తెమ్మనే చెప్పింది తనతో. ఒక్కసారైనా "వచ్చేటప్పుడు మల్లెపూలు తెమ్మనో... సన్నజాజులు తెమ్మనో... పారిజాతాలు తెమ్మనో... కోమలంగా, గోముగా తన హృదయంమీద వాలి చెప్పిందా? బొగ్గులు... బొగ్గులు తెమ్మందేగాని... జీవితం బొగ్గులైపోయింది. అప్పుడే పది పంక్తులు చదివాడు. ఒక్క అక్షరమైనా అర్థం కాలేదు... వెధవ హీగెల్ అబ్‌స్ట్రాక్టు ఫిలాసఫీ... ఇప్పుడర్థమౌతుందా? ఏమిటో ఆలోచనలు... తనకి పిచ్చి సెంటిమెంట్స్ చాలా ఉన్నాయి... ఎప్పుడో చదువుకునే రోజుల్లో తన రక్తంలోకి యెక్కి తనలో జీర్ణించుకుపోయాయి. ఇంకా దాంపత్య జీవితం అంటే మల్లెపూలు, సన్నజాజులనే భ్రమపోవటం లేదు... జీవితమంటే బొగ్గులని యింకా తెలుసుకోలేకపోతున్నాడు... "ఈ కవిత్వం, ఈ సోది నాకిష్టంలేదని ఎన్నిసార్లు చెప్పాను..." ఎన్నిసార్లు చెప్పిందో... కాని తనకి బుద్ధొచ్చిందా? వెధవ సెంటిమెంట్స్... తనని వీడటంలేదు... మగవాళ్ళకంటే ఆడవాళ్ళకి ఎక్కువ సెంటిమెంట్లు వుంటాయనుకునేవాడు తను... కాని సావిత్రికి సెంటిమెంట్లు లేవు... అదో అందమైన పాషాణం... ఎంతసేపూ విశ్వప్రసాద్, టెంపోరావు క్రైమ్‌థ్రిలర్స్ చదివే ఆ పాషాణానికి తన ఆ అతిసున్నితమైన అతికోమలమైన సెంటిమెంట్స్ ఎలా అర్థం అవుతాయి... ఆ చెత్త పుస్తకాలు చదవొద్దని లక్షసార్లు చెప్పాడు. కాలేజీ లైబ్రరీనుండి చలంగారి పుస్తకాలు తెచ్చిచ్చాడు... తనకి శరత్‌బాబు స్త్రీ పాత్రలంటే చాలా యిష్టమని చెప్పాడు... ఆ రోజుల్లో తనకి కాబోయే భార్య శరత్‌బాబు సృష్టించిన స్త్రీలాగుండాలని కలలుకనేవాణ్ని చెప్పాడు... (అలా చెబితేనన్న సావిత్రి ఆ పుస్తకాలు చదివి తనకిష్టమైనట్లు మారుతుందేమోనని ఆశించాడు) కాని తన అన్ని ఆశల్ని అడియాసలు చేసింది సావిత్రి... సావిత్రి... ఈరోజు ఒక్కక్షణం గూడా తనని వీడటంలేదు... హేగెల్... ఈ స్థితిలో హేగెల్‌ని అర్థంచేసికోగలడా? గుండెల్లో మంటలు... బుర్రలో తుఫాన్... మనస్సంతా బొగ్గులు... బొగ్గులు... ఇంటికి వెళ్ళేటప్పుడు బొగ్గులు తీసికెళ్ళకపోతే రాత్రికి తిండిలేదు. "నన్ను చేసుకుంది ఆకలితో చంపటానికా?" అని నిలదీసి అడుగుతుంది సావిత్రి. ఠంగ్ ఠంగ్‌మని బెల్ విన్పించింది... బెల్ ఐపోయింది... తనేం ప్రిపేర్ కాలేదు... ప్రిపేర్ కాకుండా క్లాసుకి వెళ్ళాలంటే తనకి చాలా భయమేస్తుంది. అందులో వెళ్ళాల్సింది ఫైనలియర్ క్లాసుకి...

ఫైనలియరనే గర్వం జాస్తి వాళ్ళకి... యేకొంచెం పొరపాటైనా గోలచేస్తారు... పిల్లికూతలు, కుక్క అరుపులు... మొన్న కొత్తగా వచ్చిన ఇంగ్లీష్ లెక్చరర్ అలా నవ్వులపాలయ్యాడట... అందుకే తనకా క్లాసంటే చాలా భయం... ఆ క్లాసులో సరళనే అమ్మాయి... చాలా తెలివిగలది... (చాలా అందమైంది కూడా... సరళన్నా తనకిష్టమే... ఆ క్లాసుకి వెళ్ళినప్పుడల్లా ఆ అమ్మాయికేసి ఓ పదిసార్లు అయినా చూస్తాడు) ప్రతీసారి ప్రశ్నలడుగుతుంది... ఈరోజుకూడా అడుగుతుంది. తను చెప్పలేకపోతే క్లాసులో నవ్వులపాలౌతాడు. తన బ్రతుకుని కాలేజీలో కూడా నవ్వులపాలు చేస్తున్నది సావిత్రి.... సావిత్రి... తనలో ఎంత కల్లోలాన్ని రేపుతున్నది... రిజిష్టర్, డస్టర్ తీసికొని క్లాసుకి బయల్దేరాడు... అటెండెన్స్ తీసికున్నాడు. ముచ్చెమటలు పోస్తున్నాయి. తను ఎప్పుడూ యే క్లాసులోను సరిగ్గా చెప్పలేదనిపించుకోలేదు. ఈరోజు ఆ పేరు రాబోతోంది. గుండెలు వేగంగా, బయటవాళ్ళకి విన్పించేటట్లుగా కొట్టుకుంటున్నాయి. చెమటలు కారుతున్నాయి. అటెండెన్స్ రిజిష్టర్ మూసేశాడు. ఏదో మాట్లాడాలి... వెంటనే ఒక ఐడియా వచ్చింది బుర్రలోకి–

"టుడే లెటజ్ టేక్ సమ్ జనరల్ టాపిక్..." అనబోయాడు.

"ఇవ్వాళ్ళ హెగెల్ స్టార్టు చేస్తామన్నారు..." అంది సరళ.

"అఫ్‌కోర్స్... బట్..." అంటూ యేదో గొణిగాడు... "అఫ్‌కోర్స్... బట్... ప్రిపేర్ కాలేదు" వెనుక బెంచీలో కూర్చున్న వాడెవడో తన కంఠాన్ని చక్కగా అనుకరిస్తూ తనలాగే అన్నాడు... అంతా గొల్లుమని నవ్వారు. (అందరితోపాటు సరళ కూడా నవ్వింది) మనస్సు చివుక్కుమంది... ఆ అవమానాన్ని భరించలేకపోయాడు.

"డోంటాక్ నాన్‌సెన్స్... ఆల్‌రైట్... ఐవిల్ స్టార్ట్ హెగెల్" అన్నాడు లేని ధైర్యాన్ని తెచ్చుకొని... క్లాసులో మళ్ళీ నిశ్శబ్దం. ఒక నలభై నిమిషాలు... యేదో నానా చెత్తవాగుడు... యే పదిసార్లో మాటలకోసం తడుముకున్నాడు... చెప్పిందే చెప్పాడు. తన మాటలు తనకే అసహ్యంగా, విసుగ్గా తోచాయి. ఆ నలభై నిమిషాలు ఒక విధమైన చిత్రవధ అనుభవించాడు... తన లెక్చర్ ఎన్నడూ అంత ఘోరంగా, చప్పగా, విసుగ్గా లేదు. స్టూడెంట్స్ కావాలని ఆవులించటం, గుసగుసలు పెట్టుకోవటం.. నవ్వటం గమనించాడు. తల తీసేసినంత అవమానాన్ని పొందాడు. తనకేసి "టుడే వాటీజ్ రాంగ్ విత్‌యూ సర్?" అన్నట్టుగా చూస్తున్న సరళ చూపుల్ని భరించలేక పోయాడు. బెల్ విన్పించటంతో ఆ నరకం నుండి బయటపడ్డాడు. బాగా చెప్పలేక పోయానన్న భావంతో మనస్సంతా ఉడికిపోయింది. బాగా చెబుతాడని నిన్ననే ప్రిన్సిపాల్ మెచ్చుకున్నాడని ఎంతో మురిసిపోయాడు... ఇంకా మంచి లెక్చరర్

అన్పించుకోవాలని, అందుకు ఎంత శ్రమైనా పడాలని నిన్ననే అనుకున్నాడు. కాని ఇవ్వాళే ఈ ఘోరం... ఈ పరాభవం... ఇన్నాళ్ళుపడ్డ శ్రమంతా వృథా అయిపోయింది. అసలు దీనికంతా కారణం సావిత్రి... తన బుర్రలో తుఫాన్ రేపింది... మనస్సు నిండా అంతులేని కల్లోలాన్ని రేపింది... స్టాఫ్ రూంకొచ్చి కూర్చున్నాడు రాజారావు.

ఎందుకో ప్రపంచమంతా తనని చూసి నవ్వుతున్నట్లనిపించింది. బొగ్గులు లేకుండా ఇంటికెళ్తే "నన్ను పస్తులుంచి చంపుతారా... ఇందుకే నన్ను చేసుకున్నారా... తిండి లేకుండా ఆకలిలో అలమటిస్తూ మీవద్ద ఉండటానికి నేనేం మీ బానిసను కాను... మా పుట్టింటికి వెళ్ళిపోతున్నాను". పుట్టింటికి వెళ్ళిపోతుంది... ఆతర్వాత ఎవడితోనైనా లేచిపోతుంది... బాగా డబ్బున్నవాణ్ణి చేసుకొని... అప్పుడు తనని లోకమంతా "ఇదిగో... ఫలానా లేచిపోయినామె భర్త ఇతడే"నంటూ వెంటపడ్తుంది... అంతా తనని "పెళ్ళాన్ని అదుపులో పెట్టుకోలేని చవట" అంటారు. కాకుల్లా, గద్దల్లా పొడుస్తారు... స్టూడెంట్స్ ఆ విషయం గోడలమీద రాసి తను కన్పించగానే కుక్కల్లా, నక్కల్లా అరుస్తారు. అది భరించగలడా తను. గుండెల్ని కోసివేసే బాధ... గుండెల్ని నులిమివేసే బాధ... కడుపులోని పేగుల్ని కదిలించే బాధ... ఇక కూర్చోలేడు... ఎక్కడికైనా పారిపోవాలి... ఇంటికెళ్తే సావిత్రి గుండెలకు హత్తుకుంటుందా? తన ఒడిలో పడుకోబెట్టుకొని ఈ పాడు ప్రపంచాన్ని మరచిపొమ్మని ఓదారుస్తుందా? 'బొగ్గులు తెచ్చారా' అని అడుగుతుంది. లేదంటే "గెటవుట్" అంటుంది. "పోషించలేని వాడివి ఎందుకు చేసికున్నా"వంటుంది, మాటలతో హింసిస్తుంది... అపహాస్యం చేస్తుంది... అవమానిస్తుంది. తన చుట్టూ ఉన్న సమాజంలాగే... కాకుల్లా గద్దల్లా తనని పొడుస్తుంది. చివరికి తనని వదిలేసి వెళ్ళిపోతుంది... ఎవడితోనైనా లేచిపోతుంది... లేచిపోతుందా? తన సావిత్రి లేచిపోతుందా... నాస్టీ నాస్టీ ఐడియా... మనస్సు కల్మషమైనప్పుడు అన్నీ నాస్టీ ఐడియాలే... ఏమైనా, సావిత్రి తన గుండెల్ని పిండి చేస్తున్నది... ప్రాణాల్ని హరించి వేస్తున్నది... గొంతు నులిమి చంపుతున్నది... ఆనాటి సావిత్రి యమున్ని మెప్పించి తన భర్తని బతికించుకొని వచ్చిందట! కానీ తన సావిత్రి మాత్రం తనని బంధించి తీసికెళ్ళి యమధర్మరాజుకి అప్పగిస్తుంది... తన సావిత్రి. తనకి తెలియకుండానే తన పిడికిళ్ళు బిగించాడు.

"క్లాసుకెళ్ళొచ్చారా..." అంటూ రఘుపతి ప్రవేశించాడు.

"ఆ! వెళ్ళొచ్చాను" అన్నాడు. వెంటనే రఘుపతిని అప్పడగాలన్న విషయం జ్ఞాపకం వచ్చింది. ఇస్తాడా? రఘుపతి దగ్గర ఎప్పుడూ డబ్బు ఉంటుందంటారు... తన దగ్గర ఎప్పుడూ ఉండదు... డబ్బున్నప్పుడు పిచ్చిగా ఖర్చు పెట్టటం... తర్వాత

బాధపడటం తనకు బాగా అలవాటైపోయింది. తనదగ్గరుండే డబ్బు జల్లెట్లలో పోసిన నీళ్ళలాగే క్షణాల్లో అయిపోతుందని అప్పుడప్పుడు అమ్మ అంటుండేది. ఎంత నిజం! రఘుపతిని ఇదివరకెప్పుడూ అడగలేదు - ఓ పది రూపాయలడిగి ఆ బొగ్గులు తీసికెళ్ళి సావిత్రి మొహాన పారేస్తేగానీ తనకీ నరకం నుండి విముక్తి లభించదు. (నిజంగా బొగ్గులు మొహానపోస్తే సావిత్రి మొహం ఎలా ఉంటుందో... నల్లగా అసహ్యంగా - తను అందమైనదాన్నని ఎంత గర్వం) కాని రఘుపతి అప్పిస్తాడా అని? ఎవర్నైనా అప్పడిగినప్పుడు వాళ్ళు లేదంటే ఎంతో అవమానం జరిగినట్లు బాధపడ్తాడు - ఆ రోజంతా అదే మనస్సులో మెదుల్తుంది. ఐనా రఘుపతి యిస్తాడు. తనంటే అతనికి మంచి అభిప్రాయమే ఉంది. అతని దగ్గర పదిరూపాయలు తప్పకుండా ఉంటాయి. అతడు చాలా పొదుపరి. తను అడిగాక లేవంటాడా? తనంటే కొంచెం గౌరవం కూడా... లెక్చరర్‌గా ఇతనికి మంచి పేరుంటని.

"ఏమండి... రఘుపతిగారు! ఒక టెన్ రుపీస్, అప్పిస్తారా? మళ్ళా ఫస్టన యిచ్చేస్తాను" హమ్మయ్య! అడిగేసాడు. ధైర్యం చేసాడు... క్షణంసేపు నిశ్శబ్దం. తన గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి... ఏమంటాడు... ఇస్తాడా? ఇవ్వడా? లేవంటాడా?

"ఐయామ్ సారీ సార్... నాదగ్గర డబ్బేమీలేదు... ఐయామ్ సారీ" అన్నాడు రఘుపతి... ఆ మాట వినగానే అతని ముఖం వెలవెలపోతోంది.

"ఇట్స్ ఆల్‌రైట్" అంటూ గొణిగాడు.

"ఐనా మీకెందుకండీ అప్పు... మీరిద్దరేగా... ప్రతినెలా బోలెడు నిలువ చెయ్యవచ్చు... మీరే మాకివ్వాలి... మాలాంటి పిల్లలుగలవాళ్ళకి..." రఘుపతి నవ్వుతూ అంటున్నాడు...

"లాస్ట్‌వీక్ కదండీ... కొంచెం అవసరపడింది" గొణిగినట్టుగా అన్నాడు.

"ఫస్ట్‌వీక్‌లో బాగా ఖర్చుపెట్టి లాస్ట్‌వీక్‌లో అప్పులకి పరిగెత్తటం యేమిటండి...? డబ్బు జాగ్రత్తగా నెలంతా వచ్చేట్లు వాడుకోవాలి..." రఘుపతి యింకేమో చెప్పబోతున్నాడు... డబ్బివ్వకపోతే యివ్వకపోయాడు... సలహాలు ఎవడివ్వమన్నాడు? ఇట్లాంటి సలహాలంటే తనకి భలే అసహ్యం. బుద్ధి తక్కువై ఇతన్ని అప్పడిగాను. "సరే... అవన్నీ నాకు తెలుసులెండి" అంటూ లేచాడు... ఎందుకో అతనికెదురుగా ఇక కూర్చోవాలనిపించలేదు... వెధవ ఎకనామిక్స్... ఎవడివ్వమన్నాడు ఇతడ్ని సలహాలు... బోడి సలహాలు. తనకామాత్రం తెలీదనుకున్నాడా? ఫస్ట్‌వీక్‌లో తను దుబారాగా ఖర్చుపెట్టి, లాస్ట్‌వీక్‌లో అప్పులకు పరుగెత్తుతున్నానని అంటాడా?

ఎంత అహంకారం... తనంటే ఎంత తేలికభావం... అసలు వాడికి తనంటే చాలా ఈర్ష్య... నేనొచ్చిన సంవత్సరంలోపలే విద్యార్థుల్లో చాలా పాప్యులర్ అయ్యానని. వాడు పదేళ్ళుగా పనిచేస్తున్నా, క్లాసుల్లో యింకా యేడ్పిస్తారుట. పైగా తనని నిన్న ప్రిన్సిపాల్ మెచ్చుకున్నాడు... అది రఘుపతిలాంటి వాళ్ళకి కడుపు మంటగా ఉంది. అతని దగ్గర డబ్బుంది... కావాలని, తనకివ్వకూడదని యివ్వలేదు. పైగా అతని బోడి సలహాలు... కేవలం తనని తేలిక చెయ్యాలనే దృష్టితో అవమానించారనే ఉద్దేశ్యంతో... ఛీ, ఛీ, ఛీ... ఈ రోజంతా ఇలాగే గడిచింది... ఎక్కడా అవమానమే... ఎక్కడా అపహాస్యమే... దీనికంతటికి సావిత్రి కారణం... వెధవ బొగ్గులు లేకుండా ఒకరోజు గడపలేదా... అంత ఖచ్చితంగా, అంత పుల్ల విరిచినట్లుగా బొగ్గులు తెమ్మని చెప్పకపోతే యేం..?

రాజారావు ఇంటివైపుగా నడుస్తున్నాడు. ఇదేమిటి, అప్పుడే ఇంటికెళ్తున్నాడు? ఇప్పుడు మూడే అయ్యింది. నాల్గింటికి కదా యింటికెళ్ళాల్సింది... ఇప్పుడే ఇంటికెళ్ళి ఏం చేస్తాడు? సావిత్రి ముందు ఎలా నిల్చుంటాడు. "బొగ్గులేవి?" అంటుంది. "తేలేకపోయా"నంటే "ఎందుకు మీ జన్మ?" అంటుంది. "ఇంతమాత్రానికి మీకొక భార్య... మీకొక కాపురం ఎందు"కంటుంది. తనలాంటి వాడికిచ్చి తన పుట్టింటివాళ్ళు తన గొంతు కోశారంటుంది. ఈ మాటలన్నీ తను భరించగలడా... ఇప్పటికే గుండెలు నీరై పోతున్నాయి. క్లాసులో నవ్వులపాలయ్యాడు. రఘుపతి ఎదుట నవ్వులపాలయ్యాడు. అంతా సావిత్రి కారణంగా... సావిత్రి, సావిత్రి తనని మల్లెల పాన్పుమీద పడుకో బెడ్తుందనుకున్నాడు. ప్రపంచాన్ని మరిపిస్తుందనుకున్నాడు. అమృతం తాగిస్తుందను కున్నాడు. కానీ ఇదేమిటి... ఇంత దుర్భరమైన బాధకి గురిచేస్తోంది... తనేం పాపం చేశాడు. ఇంత నిర్దాక్షిణ్యమైన హింసకి తను అర్హుడా! అందరిలా తను సుఖంగా గడపలేడా! సావిత్రి తన పాలిట దేవత అనుకున్నాడు... కాని తనపాలిట దయ్యామై కూర్చుంది. తనపాలిట రాక్షసి సావిత్రి... ఆ రాక్షసిని ఇప్పుడెలా ఎదుర్కోవాలి... సావిత్రిలో ఎప్పుడూ ఉండే ఆ గర్వాన్ని చూస్తే తనకి ఎందుకో భయం. ఎన్నిసార్లో అనుకున్నాడు అలా భయపడకూడదని.. ఎన్నిసార్లో అనుకున్నాడు ఆ గర్వాన్ని ఎలా అణచెయ్యాలా అని... కాని ఎప్పుడూ సావిత్రి చేతిలో అవమానాన్నే పొందుతున్నాడు. ఈరోజంతా అవమానమే... క్లాసులో... తన క్లాసులో మొదటిసారిగా స్టూడెంట్సు గొల్లున నవ్వారు... ఇదివరకు స్టూడెంట్సు తనని లైక్ చేస్తారని కొంత గర్వంగా వుండేది... ఈరోజుతో అది ఉత్త భ్రమేనని తేలిపోయింది... రఘుపతికి తనంటే కొంత గౌరవం ఉందనుకునేవాడు... కాని అతడికి తనంటే ఈర్ష్య, ద్వేషం తప్ప

ఏమీలేవు. తనంటే ఎవడికీ గౌరవం లేదు. అందరికీ తేలికభావమే.. అసలు చేసికొన్న భార్యకే తనంటే గౌరవం లేకపోతే బయటవాళ్ళకెందుకుంటుంది. తనంటే సావిత్రికి ఎంత తేలికభావం... తనో పిచ్చివాడనుకుంటుంది కాబోలు సావిత్రి. తనని విడిచేసి ఎవరితోనైనా లేచిపోతే మళ్ళీ అదే... నాస్టీథాట్... లేచిపోతే... ఈ పిచ్చివాడితో కాపురం చేసేదేమని లేచిపోతుందా? తన చిన్నప్పుడు తన ఊళ్ళో సోమయ్య - అమాయకుడు. వాడి భార్య లేచిపోవటం... "సోమయ్య అమాయకుడు... చేతకాని వాడు... అందుకే అది లేచిపోయింది" అన్నారంతా. తననూ అలాగే అంటారేమో... లేచిపోతుందా... తనకి తెలియకుండానే పళ్ళు కొరికాడు. లేచిపోతుందా? చంపేస్తాడు... తనంటే ఏమనుకుంటున్నదో... తన తడాఖా చూపిస్తాడు.

రాజారావు వేగంగా నడుస్తున్నాడు. ఇంక అర ఫర్లాంగు నడవాలి. వెళ్లేటప్పటికి సావిత్రి ఏం చేస్తుంటుందో... ఏ విశ్వప్రసాద్ నవలో చదువుతుంటుంది. లేకపోతే ముస్తాబౌతుంటుంది. ఎవరికోసం... తనకోసం కాదు. ఎవడికోసం మరి... ఒక్కసారైనా తనకోసమని చెప్పిందా? తనకిష్టమైన పూలు పెట్టుకుందా? 'నారాజా!' అంటూ తనని హృదయానికి హత్తుకుందా? ఎండమావి... సావిత్రి ఎండమావి... తను వెర్రిగా పరుగెత్తుతున్నాడు ఆ ఎండమావి కోసం... అలా పరుగెత్తుతోంటే తనని చూసి హాయిగా నవ్వుకుంటోంది సావిత్రి... మరి తనకోసం కాకపోతే సావిత్రి ఎవడికోసం ముస్తాబౌతుంది... ఏమో... ఎవడున్నాడో... తనకేం తెలుసు... నాస్టీథాట్స్... ఇవ్వాళన్నీ ఇట్లాంటి వెధవ ఆలోచనలే కల్గుతాయి. రాజారావు ఇంకా వేగంగా నడుస్తున్నాడు. తను ఇంటికి వెళ్ళగానే సావిత్రి ముఖంలోకి ఆ తేలికతనం ప్రవేశిస్తుంది... "బొగ్గులేవి?" అంటుంది. ఏదో తప్పుచేసిన కుర్రాడిని యజమానురాలు అడిగినట్లుగా... దట్స్... నాన్‌సెన్స్... తనిలా భయపడ్తున్నాడు. కాబట్టే సావిత్రి అలా తనమీద స్వారిచేస్తోంది. ఎందుకు తను భయపడటం... గోలపెట్టుకోవటం దేనికని... నాగరికత, సభ్యత, సంస్కారం, డెలికసీ, స్త్రీలపట్ల తనకుండే గౌరవం... ఇవన్నీ అడ్డొస్తున్నాయి. ఇవన్నీ ఉత్త నాన్‌సెన్స్... తన అసమర్థతను కప్పిపుచ్చుకోవటానికి తను కల్పించుకున్న బురఖాలు.

తన ఇల్లు దూరంగా కన్పిస్తోంది. బయట ఒక రిక్షా నిలిచివుంది. సావిత్రి రిక్షావాడితో మాట్లాడుతోంది... అకస్మాత్తుగా రాజారావు బుర్రలో ఏదో మెరిసింది. ఔను... సావిత్రి ఒకసారి తనతో చెప్పింది ఆ "కండలున్న రిక్షావాడంటే తనకిష్టమని" అతనికేదో బ్రహ్మాండమైన రహస్యం తెలిసినట్లనిపించింది. ఇంకా వేగంగా

నడుస్తున్నాడు. వాళ్ళిద్దరూ స్పష్టంగా కనిపిస్తున్నారు. వాడు నల్లగా, మొద్దుగా, కండలు తిరిగి నల్లరాతి విగ్రహంలా... వాడితో పోట్లాడితే తను గెలువగలడా? సావిత్రి వాడితో నవ్వుతూ మాట్లాడుతోంది. (తనతో ఎప్పుడు అలా హాయిగా నవ్వుతూ మాట్లాడలేదు సావిత్రి) తనలో ఏదో వెర్రి ఆవేశం ఉవ్వెత్తున లేచింది. వాళ్ళిద్దరూ తనని చూశారు. వెంటనే సావిత్రి ఇంట్లోకి వెళ్ళింది. వాడు రిక్షా తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు. వాళ్ళు తనని చూడగానే వెంటనే అలా వెళ్ళిపోవటం... ఆ దృశ్యంలో దగా, మోసం, కుట్ర స్పష్టంగా కన్పించాయి. వాళ్ళిద్దరూ తన కళ్ళల్లో కారం చల్లుతున్నారనిపించింది... ప్రొద్దుటి నుండి మండుతున్న తన హృదయం మీద ఆ దృశ్యం పెట్రోల్‌ని పోసింది... విసురుగా ఇంట్లోకి వెళ్ళాడు. తనేం చేస్తున్నాడో, తనేం మాట్లాడుతున్నాడో తనకి తెలియటం లేదు. ఇప్పుడు అతనొక భయంకర జ్వాల... ఇప్పుడతడంతా ఆవేశం!

"వాడితో ఏం మాట్లాడుతున్నావ్" అన్నాడు సావిత్రిని చూడగానే

"ఏముంది... ఏమీలేదు" అదే, ఆ కంఠంలో, ఆ చూపులో ఎప్పుడూ ఉండే ఆ తేలికతనం, ఆ అహంకారం, ఆ నిర్లక్ష్యం...

"ఏమిటా తలబిరుసు... అడిగిందానికి సమాధానం చెప్తావా? లేదా?" గట్టిగా అరిచాడు.

"ఎందుకలా అరుస్తారు... బాగా తాగొచ్చినవాడిలాగ"

"ఔను... ఇవ్వాళ్ళ తాగే వచ్చాను. తాగినవాడు యేంచేస్తాడో చూపించనా?"

అంతే! సావిత్రి చెంప చెళ్ళుమంది - ఆమె పరిస్థితి అర్థం చేసుకునేలోగానే యింకో చెంప - సావిత్రి తప్పించుకోబోయింది - తన బలమంతా కేంద్రీకరించి అతన్ని వెనక్కి తోసింది. అతడు క్రిందపడబోయి నిలదొక్కుకున్నాడు - దానితో అతడింకా రెచ్చిపోయాడు - యింకా విజృంభించాడు. సావిత్రి మూతిమీద గుద్దాడు. పెదవి పగిలి రక్తం కారింది... కొప్పుపట్టుకొని ఈడ్చాడు... జాకెట్ లాగి ఫర్రుమని చించాడు... తనివితీరా చెంపలు వాయించాడు. సావిత్రి కుప్పలా కూలిపోయింది... అతడు ఆగాడు. సావిత్రి రామయ్య భార్యలా గొల్లుమని యేడ్వటం లేదు. అసలు సావిత్రికి స్పృహ ఉన్నట్లు లేదు. సావిత్రి ముఖంకేసి చూశాడు. సావిత్రిలో ఎప్పుడూ తనకి కన్పించే ఆ తేలికతనం, అహంకారం, నిర్లక్ష్యం లేవిప్పుడు... జాలిగా, దీనంగా, హీనంగా, నిస్సహాయంగా, వేటగాడి రైఫిల్ గుండుకి గురైన లేడిలా ఉంది. సరిగ్గా సావిత్రిని అలా చూడాలనుకున్నాడు - ఆ కోరిక తీరింది. గుండెల బరువు తీరింది... నిట్టూర్చాడు రాజారావు.

"మీకు పిచ్చెక్కిందా? ఆ రిక్షావాడితో బొగ్గులబస్తా తెప్పించాను" యేడుస్తూ బొగ్గుల బస్తాను చూపించింది సావిత్రి.

ఓ మూలనపడున్న బొగ్గుల బస్తాను అతడు చూశాడు.

సావిత్రి ఆ రిక్షావాడితో బొగ్గులబస్తా తెప్పించిందని రాజారావుకు కొంచెం ఆలస్యంగా అర్థమైంది. తన ప్రపంచంలో తనుండిపోయాడే తప్ప ఆమె ప్రపంచంలో కెళ్ళలేకపోయానని అతనికనిపించింది.

"నన్ను క్షమిస్తావా సావిత్రి!" అన్నాడు కన్నీటి ప్రవాహంగా మారిపోయిన సావిత్రి గదుమ పట్టుకొని.

"నా ప్రపంచంలో నేనుండిపోయానే తప్ప నీ ప్రపంచంలోకొచ్చే ప్రయత్నం చెయ్యకపోవడం నేను చేసిన పెద్ద తప్పు" అన్నాడతడు, రెండు చేతులతో తన తలను బాదుకుంటూ.

"అలాంటి తప్పే నావల్ల కూడా జరిగిందేమో!" అందామె అతని చేతుల్ని పట్టుకొని.

అతడామె కళ్ళనీళ్ళు తుడుస్తూ "అలాంటి తప్పు నావల్ల మరోసారి జరగదు సావిత్రి!" అన్నాడు.

ఆమె నిశ్శబ్దంగా తలూపింది.

'సృజన' త్రైమాసిక (ఆగస్టు-అక్టోబర్, 1967)

*(నేపథ్యం : ఎప్పుడూ తనకై తాను నిర్మించుకున్న ఒక స్వాప్నిక ప్రపంచంలో జీవించే భర్త, వాస్తవ ప్రపంచమే తప్ప స్వాప్నిక ప్రపంచం తెలీని భార్య – వీళ్ళద్దరి మధ్య సంఘర్షణ. వాళ్ళు కొత్తగా పెళ్ళిచేసుకున్న దంపతులు. వాళ్ళిద్దరూ ఒకర్నొకరు తెలుసుకొని సజావుగా సహజీవనం చెయ్యటానికి కొంతకాలం పడ్తుందని ఒక జంటను చూసి రాసిన కథ.)*